సాక్షి హనుమకొండ

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలి

పోలీసులు సమాజానికి సేవ చేస్తూ శాఖ ప్రతిష్టతను మరింత పెంచాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. - 8లో▸



మిర్చికి అ'పూర్వ' వైభవం

రోజురోజుకూ చపాట రకం మిర్చి వినియోగం పెరుగుతుండడంతో తూర్పు ఆసియాలో డిమాండ్ పెరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఏసీపీ



వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధి పరకాల ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సి.సతీశ్‌బాబు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ.. పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకానికి తగినట్లుగా నీతి నిజాయితీతో సేవలందించాలన్నారు.

'ఎల్‌సీడీసీ' పారదర్శకంగా చేపట్టాలి

● డీఎంహెచ్ఓ అప్పయ్య

ఎంజీఎం/హన్మకొండ చౌరస్తా: జిల్లాలో చేపట్టిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను (ఎల్‌సీడీసీ) అందుబాటులో ఉన్న ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో పారదర్శకంగా చేపట్టాలని డీఎంహెచ్ఓ అప్పయ్య వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ..దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కేన్సర్ పట్ల అవగాహన కల్పించి స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. సొంత ఆస్పత్రి భవన నిర్మాణానికి స్థల సేకరణ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రోహిత్, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టేబుల్ టెన్నిస్ టోర్నీకి కేయూ జట్టు



కేయూ క్యాంపస్: వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నేటినుంచి 14వ తేదీ వరకు జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్(పురుషుల) టోర్నమెంటులో పాల్గొనే కేయూ జట్టును ఎన్నుకున్నట్లు కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. పి.భరత్‌కుమార్‌రెడ్డి, బి.చింతేశ్వర్‌రెడ్డి, కె.దీపక్‌బాబు, జి.నిఖిల్ రెడ్డి, ఎస్.ప్రేమ్‌దినకర్ (వరంగల్ కిట్స్) ఉన్నారు. కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీధర్‌కుమార్ వీరికి మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

సోనియా జన్మదిన వేడుకల్లో ఆధిపత్య పోరు

● ఎర్రబెల్లి స్వర్ణ.. 'కొండా' అనుచరుల వేర్వేరు కార్యక్రమాలు

రామన్నపేట: ఏఐసీసీ అగ్రనేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ వేదికగా కాంగ్రెస్ నాయకుల ఆధిపత్యపోరు కనిపించింది. సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యాన 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శ్రీమాన్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్ వేడుకలు నిర్వహించారు. అనంతరం అదే వేదికగా నవీన్‌రాజు ఆధ్వర్యాన మంత్రి కొండా అనుచరులు సోనియాగాంధీ భారీ కటౌట్‌పై పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, తోట వేణు తదితరులు పాల్గొన్నారు.

మెట్లబావి అభివృద్ధి పనుల పరిశీలన



ఖిలా వరంగల్: నగరంలో ప్రసిద్ధి చెందిన మెట్లబావిని (రాణిరుద్రమ దేవి స్నానాల బావి) సోమవారం కాంట్రాక్టర్ కల్పనతో కలిసి పురావస్తుశాఖ ఇంజనీర్లు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా బావి పూర్వవైభవానికి చేపడుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మరింత వేగం పెంచాలని ఇంజనీర్లు కాంట్రాక్టర్‌ను సూచించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, పూర్వీకులు అందించిన అద్భుత కట్టడాలను భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, స్థానికులు బిల్లా రాజు, బజ్జూరి అంజయ్య పాల్గొన్నారు.

అడిగినంత ఇచ్చుకో.. అడ్డంగా తవ్వుకో..!

'కాసులు' కురిపిస్తున్న వాగుల ఇసుక..

- దందాకు రాజకీయ ముసుగు
- చలివాగు పరీవాహక ప్రాంతాలే కేంద్రాలు
- కొందరు స్థానిక నాయకులే కర్త, కర్మ, క్రియ..
- రేగొండ, పరకాలలో డంపింగ్ కేంద్రాలు.. లారీల్లో హైదరాబాద్‌కు రవాణా
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న పోలీసు, మైనింగ్, రెవెన్యూ శాఖలు



పరకాల సబ్‌డివిజన్ కేంద్రంలో ఇసుక డంపు

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రకృతి సహజంగా పారే మానేరు తీరాలు, వాగులలో ఇసుక అందరికీ కాసులు కురిపిస్తోంది. ఇసుక దందా ఈజీ మనీకి మార్గంగా మారింది. మామూలు వ్యక్తుల నుంచి 'మాఫియా'గా ఎదుగుతున్న ఈ వ్యాపారుల వెనుక కొందరు రాజకీయ నాయకులే ఉండటం గమనార్హం. రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నా.. పోలీసు, రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇందుకు టేకుమట్ల, మొగుళ్లపల్లి, చిట్యాల, రేగొండ మండలాల నుంచి ట్రాక్టర్ల ద్వారా పరకాల డంపింగ్ పాయింట్లకు పట్టపగలు ఇసుక చేరుతున్న దృశ్యాలే సాక్ష్యం.

హన్మకొండ, పరకాలల్లో డంపింగ్..

జేఎస్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో చలివాగు పరివాహక ప్రాంతం ఇసుక తవ్వకాలకు ప్రధాన వనరుగా మారింది. టేకుమట్ల, చిట్యాల, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని పలు పలుచోట్ల ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడి నుంచి ట్రాక్టర్‌ల ద్వారా పరకాల, రేగొండ, హన్మకొండలలోని డంపింగ్ కేంద్రాలకు చేరుతోంది. చలివాగు, దమ్మన్నపేట, కాల్వపల్లి, రేపాక, కనపర్తి, చలివాగు బ్రిడ్జి మీదుగా ఇసుక తరలింపునకు ఒక మార్గం కాగా.. లింగాల క్రాస్, రాయపర్తి, దమ్మన్నపేట, మెయిన్ రోడ్డు మీదుగా పరకాలకు మరో మార్గంలో ఇసుక ట్రాక్టర్లు చేరుకుంటున్నాయి. పరకాలలో డీపీఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంతో పాటు మరో నాలుగు చోట్ల ఇసుక డంపులు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. కాల్వపల్లి నుంచి పరకాలకు ఇసుక తరలిస్తే ఒక ట్రాక్టర్ యజమాని నెలకు రూ.10 వేలు ఒక కీలకశాఖకు చెల్లిస్తున్నారట. వ్యాపారాన్ని బట్టి ఆ శాఖకు రోజుకు వెయ్యి రూపాయలు ఇచ్చే ట్రాక్టర్ యజమానులు కూడా ఉన్నారని, లేదంటే కేసులు తప్పవన్న ప్రచారం కూడా ఉంది.

కీలక ప్రజాప్రతినిధి ముందే హెచ్చరించినా..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటి నిర్మాణాలకు స్థానికంగా ఉన్న ఇసుకను తరలించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని ఊటంకిస్తూ స్థానిక అవసరాలకు ఇసుకను ఉపయోగించుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని ఓ కీలక ప్రజాప్రతినిధి అధికారులకు బహిరంగంగానే చెప్పారు. ఇదే సమయంలో స్థానిక, వ్యక్తిగత అవసరాలకు ఇసుక తీసేవారు పరకాల చలివాగు దాటొద్దని కూడా హెచ్చరించారు. అయితే ఆ కీలక ప్రజాప్రతినిధి ఇచ్చిన వెసులుబాటును అదునుగా భావించిన ఇసుక వ్యాపారులు 'మాఫియా'గా మారి మరింత రెచ్చిపోతుండటం చర్చనీయాంశం అవుతోంది.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

రేగొండలో రాజకీయ ముసుగు..

రేగొండలో కొందరు మాజీ ప్రజాప్రతినిధులు 'సిండికేట్'గా మారి ఇసుక అక్రమ దందాకు మరింత ఊపునిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాగుల నుంచి నిత్యం ఇసుక తవ్వే ట్రాక్టర్‌ల యజమానులకు నాయకత్వం వహిస్తూ అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఉదయం 6 గంటల లోపు.. సాయంత్రం 6 గంటల తర్వాతే స్థానిక అవసరాలకు ఇసుక తీసుకోవాలన్న నిబంధనలకూ వీరు పాతరేశారు. రేగొండకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి నేతృత్వంలో మరో ఐదుగురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రేగొండలో డంపింగ్ కేంద్రం నిర్వహిస్తూ పెద్ద ఎత్తున దందా సాగిస్తున్నారు. డంపింగ్ కేంద్రంలో లారీలు నింపి గోరుకొత్తపల్లి (కొత్తపల్లి గోరి), కొప్పుల మీదుగా శాయంపేటకు.. అక్కడి నుంచి హన్మకొండ, హైదరాబాద్‌కు రోజుకు పదుల సంఖ్యలో తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. ఇందుకు సహకరించే అధికారుల్లో కొందరికి రోజు, నెలవారీ మామూళ్లు కూడా ముట్టచెబుతున్నట్లు బహిరంగ చర్చ జరుగుతోంది. ఈ మామూళ్లలో పోలీసుశాఖది సింహభాగం ఉంటుందని కూడా అంటున్నారు. అందువల్లే పరకాల, హనుమకొండ ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారినట్లు తెలుస్తోంది.

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు

● అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందులో జీడబ్ల్యూఎంసీకి సంబంధించి 15, ఎల్కతుర్తి తహసీల్దార్ 6, హసన్‌పర్తి తహసీల్దార్ 5, ఆర్‌డీఓ హనుమకొండ, పరకాల 5తో పాటు వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 88 వినతులు ఉన్నాయి. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన వినతులను అధికారులు జాప్యం చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ఓ వైవీ.గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు రాథోడ్ రమేష్, నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ గ్రీవెన్స్‌కు 104 అర్జీలు

వరంగల్: సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 104 అర్జీలు రాగా.. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి.. డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణితో కలిసి స్వీకరించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అవినీతిని అరికట్టాలి

● వినూత్నంగా జ్వాలా, లోక్‌సత్తా ర్యాలీ



అంబులెన్స్‌లో పేషంట్, బాడీబిల్డర్లతో ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోందని, దానిని అరికట్టాలని జ్వాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ అన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని లోక్‌సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారుడు కోదండరామారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అంబులెన్స్‌లో పేషంట్‌ను నీతి, నిజాయితీగా, కండలు తిరిగిన బాడీబిల్డర్లను కూర్చోబెట్టి ప్రదర్శించగా నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఏసీబీ ద్వారా పట్టుబడిన కేసులు నిరూపితం కాకపోవడంతో ప్రభుత్వ అధికారులకు భయం లేకుండా పోయిందన్నారు. అవినీతి అధికారులను పట్టించిన పౌరులను ప్రభుత్వం సన్మానించి, నగదు ప్రోత్సాహకాలను అందించాలని కోరారు. డిసెంబర్ 9 అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని అన్నారు. కోదండరామారావు మాట్లాడుతూ చెరువులు, కుంటలను కాపాడేందుకు హైడ్రా ఏర్పాటు చేసిన విధంగానే.. ఏసీబీని మరింత పటిష్ట పరిచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఏడీ అశోక్‌కుమార్, ప్రకాష్, బుర్రి కృష్ణమూర్తి, అచ్చే అమర్‌నాథ్, బుద్దె సురేష్, సుంకరి రాజు, ఎన్‌సీసీ విద్యార్థులు, జ్వాలా, లోక్‌సత్తా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.73 కోట్ల పన్నులు వసూలు చేయాలి

- మూడు నెలల్లో లక్ష్యం ఛేదించాలి
- సమీక్ష సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: నగర పరిధిలో రూ.73కోట్ల పన్నులను రానున్న మూడు నెలల కాలంలో వసూలు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. మేయర్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.113కోట్ల పన్ను వసూలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.40 కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. ఆస్తి పన్నుతో పాటు వాటర్ టాక్స్‌పై శ్రద్ధ వహించాలని, పక్షం రోజుల్లో పన్నుల వసూలు 60శాతం పురోగతి సాధించకుంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది మ్యుటేషన్, కొత్త గృహాలను గుర్తించి అసెస్‌మెంట్, రివైజ్డ్ అసెస్మెంట్ చేయాలని చెప్పారు. రెసిడెన్స్‌కు అనుమతి పొంది కమర్షియల్‌గా వినియోగించే ఫంక్షన్ హాల్స్, హాస్టల్స్, రెస్టారెంట్లను పరిశీలించి ఆస్తిపన్నుతో పాటు నల్లా పన్ను కమర్షియల్‌గా రివైజ్డ్ చేయాలని సూచించారు. బల్దియా వ్యాప్తంగా 100 ఫీట్ల రోడ్‌లోని భవనాల పర్మిషన్, డీవియేషన్, రెసిడెన్షియల్, కమర్షియల్ వివరాలు పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ నిమిత్తం రోజూ కనీసం 15 దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. సమీక్షలో అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ప్రసన్నారాణి, ఐటీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

సీఎం కప్–2024 క్రీడాపోటీల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియాలోని తన చాంబర్‌లో డిప్యూటీ కమిషనర్లు, ఎంఈఓలు, ఫిజికల్ డైరెక్టర్లతో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ..సీఎం కప్ పోటీల నిర్వహణకు బల్దియా తరపున వరంగల్, ఖిలావరంగల్, కాజీపేట, హనుమకొండ మండలాల్లో విస్తృతంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నేటినుంచి రెండ్రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి సీఎం కప్ పోటీలను మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించాలన్నారు. పోటీల్లో 18నుంచి 35 ఏళ్ల వయసు వారు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. వరంగల్ ఓ సిటీ, ఖిలావరంగల్ గ్రౌండ్, శంభునిపేటలోని ప్రభుత్వ జూనియర్‌కాలేజ్ గ్రౌండ్, హనుమకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యాసంగి పంటలకు సాగునీరు!

లక్ష్యం 5.77 లక్షల ఎకరాలు

- ఇరిగేషన్ శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- 2025 జనవరి 1 నుంచి మార్చి 31 వరకు..
- ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన సాగునీరు విడుదల
- ఉమ్మడి జిల్లా ఆయకట్టుదారులకు శుభవార్త



సాక్షిప్రతినిధి, వరంగల్: యాసంగి పంటలకు సాగునీరు అందించేందుకు నీటిపారుదలశాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుతడి, తరి కలిపి సుమారు 5.77 లక్షల ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్(వారబందీ) పద్ధతిన నీటిని విడుదల చేయనున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కాళేశ్వరం, ఎస్సారెస్పీ స్టేజ్–1, ఎస్సారెస్పీ స్టేజ్–2, దేవాదుల ఎత్తిపోతల పథకాల ద్వారా ఇరిగేషన్ అధికారులు ఈ ఆయకట్టును ప్రతిపాదించారు. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక, యాజమాన్య కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి వరంగల్‌లోని ఆయకట్టుకు నీరందించడంతో పాటు అవసరమున్న చెరువులు, రిజర్వాయర్లు నింపేందుకు సుమారు 26.20 టీఎంసీలు అవసరం ఉంటుంది. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో ఇప్పటికే నారు పోసి వరినాట్లకు సన్నద్ధమవుతుండగా.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో రైతులు యాసంగి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

జనవరి 1 నుంచి విడుదల..

ప్రాజెక్టుల కింద యాసంగి పంటకాలానికి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఐదు టీఎంసీల నీటిని వరద కాలువ ద్వారా శ్రీరామసాగర్ ప్రాజెక్టు రెండో దశకు విడుదల చేయనున్నారు. ఈ ఏడాది వర్షాల మధ్య విరామం తక్కువగా ఉండటంతో నేలలో తేమ ఉన్నందువల్ల తక్కువ నీటి తడులు అవసరమయ్యే అవకాశాలు ఉంటాయని అధికారులు అంచనా వేశారు. ఇందుకు తోడు శ్రీరామసాగర్ ఎగువ నుంచి గోదావరిలోకి నీటి ప్రవాహం వస్తుండగా.. దిగువన కూడా వినియోగించిన నీరు(రీ–జనరేషన్) వచ్చి కలుస్తున్నందున యాసంగిలో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాజెక్టుల్లో నీటిలభ్యతకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్‌లో సుమారు 5.77లక్షల ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన యాసంగి సాగునీరు సరఫరా కానుందని అంచనా వేశారు. 2025 జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు వారం రోజులు నీటి విడుదల చేస్తే.. మరో వారం రోజులు సరఫరా నిలిపి వేస్తారు. ఇరిగేషన్ అధికారుల ప్రతిపాదనల ప్రకారం ఎస్సారెస్పీ స్టేజ్–1(ఎల్ఎండీ)కింద 2,21,947 ఎకరాలు, కాళేశ్వరం ప్రాజెక్టు కింద 93,070 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే ఎస్సారెస్పీ–2 కింద 90,611 ఎకరాలు, దేవాదుల ఎత్తిపోతల ద్వారా 1,71,528 ఎకరాల ఆయకట్టుకు ఈ యాసంగిలో నీటి సరఫరా చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఆరుతడి, తరి పంటలకు సాగునీరు

> యాసంగిలో స్థిరీకరించిన ఆరుతడి, తరి పంటలకు సాగునీరు అందించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ మేరకు వచ్చే జనవరి 1 నుంచి మార్చి 31 వరకు వారబందీ పద్ధతిన నీటి సరఫరా చేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరుతడి పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
>
> - రాజు, డీఈఈ, నీటిపారుదలశాఖ

జీవన సంస్కృతిని పెంపొందించాలి

● కాత్యాయనీ విద్మహే, మెట్టు రవీందర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫోరం బాధ్యులు

హన్మకొండ కల్చరల్: ప్రజలు, యువత లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతిని పెంపొందించుకోవాలని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం బాధ్యులు కాత్యాయనీ విద్మహే, మెట్టు రవీందర్ అన్నారు. ఈనెల 14న మహబూబ్‌నగర్‌లో జరిగే సమూహ–సెక్యులర్ రైటర్స్ ఫోరం మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం అదాలత్ సమీప కాళోజీ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ఆధునిక రాజ్యాంగం రచించి ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ దేశంలో మత ప్రసక్తి లేని రాజ్యపాలనను మనమింకా నెలకొల్పకోలేక పోయామన్నారు. ఈ కార్యక్రమంలో అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, కోడం కుమారస్వామి, గంగాధర్, బిల్లా మహేందర్, వీర బ్రహ్మాచారి, అనిశెట్టి రజిత, విద్యావతి, రాథోడ్, ఎం.శ్యామల, జయంత్, పాణి, కర్రె సదాశివ్, వెంగల్‌రెడ్డి, డాక్టర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

● డీఈఓ వాసంతి



సమావేశంలో మాట్లాడుతున్న వాసంతి

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు కృషిచేయాలని డీఈఓ డి.వాసంతి కోరారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారి జి.నెహ్రూ,స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు రవికుమార్,రామారావు,రాంజీ, సీఆర్పీలు ఉమారాణి,నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

● టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్



మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి: సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హనుమకొండ ఏకశిలపార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. భోగేశ్వర్‌తోపాటు టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. 19,360 మంది ఉద్యోగులు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కనీసం వేతన చట్టం అమలు చేయడం లేదన్నారు. నేటినుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేయనున్నట్లు ఇప్పటికైనా సీఎం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బెల్లంకొండ పూర్ణచందర్, పూజారి మనోజ్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, షఫీ, బాధ్యులు రఘు, ఆనందం, జ్యోతి, రాంప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● కలెక్టర్ ప్రావీణ్య



గ్రూప్–2 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై మాట్లాడుతున్న అధికారి

హన్మకొండ అర్బన్: ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 82 పరీక్ష కేంద్రాల్లో 33,005 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ నుంచి ఇద్దరిని, జిల్లా నుంచి మరో ఇద్దరిని రీజనల్ కోఆర్డినేటర్లుగా నియమించారని తెలిపారు. 82 మంది అబ్జర్వర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 12 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, జాయింట్ రూట్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను, అభ్యర్థుల ఐడెంటిటీ కోసం 24 మంది ప్రత్యేక సిబ్బంది కూడా నియమించినట్లు పేర్కొన్నారు. రెండు సెషన్లలో జరిగే పరీక్షకు అభ్యర్థులను గంటన్నర ముందే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. నిమిషం ఆలస్యం నిబంధన వర్తించదని వెల్లడించారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు, 4 కేంద్రాల్లో 96 మంది అభ్యర్థులు సహాయకుల కోసం అభ్యర్థించగా వీరికి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులను సహాయకులుగా నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణపై అధికారులతో ఈనెల 11న కలెక్టరేట్ కార్యాలయంలో సమన్వయం సమావేశం, 12న చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరంగల్‌లో 28 సెంటర్లు..

వరంగల్: గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడా రు. గ్రూప్–2 పరీక్ష రాసే 10,310 మంది అభ్యర్థులకు 28 సెంటర్లు అలాట్ చేసినట్లు తెలిపారు. ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ప్రతీ సెంటర్‌కి 5 నుంచి 10 మంది జూనియర్ అసిస్టెంట్లు గుర్తింపు అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఆయా రూట్లలో అభ్యర్థులకు సౌకర్యంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని. పరీక్ష సెంటర్ల పరిధిలో పవర్ కట్ లేకుండా చూడాలని, సెంటర్లలో ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, అడిషనల్ డీసీపీ రవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న సీనియర్స్ ఖోఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15న ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్స్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, తోట శ్యాంప్రసాద్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే మెన్, ఉమెన్ క్రీడాకారులు జేఎన్ఎస్‌లోని ఖోఖో మైదానం వద్ద ఉదయం 10గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జట్టును జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు వరంగల్ జిల్లా గీసుగొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్ఏ కోచ్ రాజారపు రమేశ్ మొబైల్ నంబర్ 99633 36559లో సంప్రదించాలని తెలిపారు.

వడ్డేపల్లి చెరువులో యువకుడి ఆత్మహత్య

కాజీపేట: గ్రేటర్ పరిధిలోని 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో పడి వంగాల గౌతమ్ (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదివారం ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లిన గౌతమ్ తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వడ్డేపల్లి చెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం తేలియాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని గుర్తించారు. తండ్రి వంగాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గణపురంలో మరో యువకుడు..

గణపురం: మండలకేంద్రానికి చెందిన కొలపూరి మధు(38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. మధు తల్లిదండ్రులు తన చిన్నప్పుడే మృతి చెందారు. మధుకు వివాహం కాగా కుమారుడు, కూతురు ఉంది. కుటుంబ కలహాలతో చాలా రోజులుగా భార్య, పిల్లలు మధుకు దూరంగా ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న మధు కూలీ పనులు చేసుకుంటు తన తాత దగ్గర జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధు ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు

కాశోజీ సెంటర్: దుబాయ్‌లో పని చేయడానికి డెలివరీ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేయడానికి అవకాశం ఉందని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సీహెచ్.ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపనీ లిమిటెడ్ (టామ్ కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్‌ను సులభతరం చేయడానికి పనిచేస్తుందని పేర్కొన్నారు., చట్టబద్ధమైన మార్గాల ద్వారా దుబాయ్‌లో పనిచేసేందుకు రిక్రూట్‌మెంట్ కోసం 94400 50951, 94400 49861, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

మిర్చికి 'అపూర్వ' వైభవం

- చపాట మిర్చికి జీఐ ట్యాగ్
- తిమ్మంపేటలో సంబురాలు



చపాట రకం మిర్చి

దుగ్గొండి: చపాట రకం మిర్చి.. దీనిని లంబుకాయలు, టమాట మిరపకాయలు, దొడ్డు మిరప, దేశీ మిరప అనే రకరకాల పేరుతో పిలుస్తుంటారు. ఇది ఏ శాస్త్రవేత్త కనిపెట్టిన రకం కాదు.పురాతన కాలం నుంచి రైతులు తాము పండించిన కాయల నుంచే విత్తనాలు సేకరించి పండించుకుంటున్నారు. తక్కువ విస్తీర్ణంలో పండించే చపాట మిర్చిని గ్రామాల్లో మొదట పచ్చళ్లు, కారం పొడికి వినియోగించే వారు. కాలక్రమేణా వీటిలో ఎరుపు రంగు ఎక్కువ ఉండడం.. కారం తక్కువ ఉండడంతో రెస్టారెంట్లు, బేవరేజెస్ పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమలలో వీటి వినియోగం విరివిగా పెరిగింది. ఫలితంగా తూర్పు ఆసియాలో భారీ డిమాండ్ ఉండడంతో ధర ఎక్కువ పలకడం ప్రారంభమైంది. దీంతో ఇక్కడి రైతులు తమ పంటను ముంబాయి, అహ్మదాబాద్, నాగ్‌పూర్ ప్రాంతాలకు తీసుకెళ్లి రోజుల తరబడి అక్కడే ఉండి ఎక్కువ ధరకు అమ్ముకుని వస్తుంటారు..

జీఐ ట్యాగ్ కోసం తిమ్మంపేట అన్నదాతల ఆలోచన..

చపాట మిర్చికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం కోసం మండలంలోని తిమ్మంపేట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సంఘం నడుం బిగించింది. వీరికి మహబూబాబాద్ మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సహకరించారు. మిరప పంట విధానం, ప్రత్యేకతలు, మార్కెటింగ్‌పై 26 పేజీల డాక్యుమెంటరీని రూపొందించి సెప్టెంబర్ 16–2022లో భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కోసం ఐపీఓ(ఇండియన్ పేటెంట్ ఆఫీస్)కు దరఖాస్తు చేశారు. రెండు సంవత్సరాల అనంతరం ఇండియన్ పేటెంట్ ఆఫీస్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్‌ను ఆమోదించింది. దీంతో తిమ్మంపేట గ్రామంతో పాటు ఇదే మిర్చి పండించే ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల రైతులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు.



తిమ్మంపేట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ కార్యాలయం

ఆనందంగా ఉంది..



మిరప పంటను మా గ్రామంతో పాటు నర్సంపేట నియోజకవర్గంలో నర్సంపేట రూరల్, దుగ్గొండి, నల్లబెల్లి మండలాలు, పరకాల, భూపాలపల్లి, రేగొండ మండలాల్లో పండిస్తారు. పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే కాసుల పంటే. ఏమాత్రం అశ్రద్ధ చేసినా చేతికి అందదు. మేము 300 మందిమి కలిసి 2019లో రైతు ఉత్పత్తి సంఘాన్నిఏర్పాటు చేసుకున్నాం. మేము పండించే మిరపకు భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని తొలిరోజున అనుకున్నాం. దీనికి జేవీఆర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్త భాస్కర్, అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకరించారు. డాక్యుమెంటరీ రూపొందించారు. కృషి ఫలించింది. తిమ్మంపేట నుంచి వెళ్లిన దరఖాస్తు చపాట మిర్చికి భౌగోళిక గుర్తింపు తీసుకురావడం ఆనందంగా ఉంది..

నరహరి రాజుకుమార్‌రెడ్డి,
తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

తాతల నాటి రకాలనే సాగు చేస్తున్నాం..



నేడు వివిధ రకాల పంటల విత్తనాలు హైబ్రిడ్‌లు వస్తున్నాయి. వరి నుంచి మొదలు.. పప్పు దినుసులు, వాణిజ్య పంటలు, సన్న రకం మిరప వరకూ హైబ్రిడ్‌లు ఉన్నాయి. చపాట మిర్చికి మాత్రం పేర్లు లేవు. అవి ఈనాటివి కావు. మా తాతల కాలం నాటివి. రైతులే విత్తనాలు ఉత్పత్తి చేసుకుని పండించుకునేవి. శాస్త్రవేత్తలు కనిపెట్టినవి కావు. రైతుల విత్తనాలతో పండిన పంట చపాట రకానికి జీఐ ట్యాగ్, అంతర్జాతీయ భౌగోళిక గుర్తింపు రావడం రైతులకు దక్కిన అరుదైన గౌరవం. ఆనందంగా ఉంది.

- సొదారపు శోభన్, రైతు, తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ
- సీకేఎం ఆస్పత్రిలో ఆందోళన

ఎంజీఎం : వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగానే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన ఘటన సోమవారం సీకేఎం ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన బదావత్ నవ్య ఈనెల 5న సీకేఎం ఆస్పత్రిలో ప్రసవ చికిత్సల కోసం అడ్మిట్ అయింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు 7వ తేదీన శస్త్రచికిత్స నిర్వహించగా మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువును పరీక్షించిన వైద్యులు ఉమ్మనీరు మింగినట్లు గుర్తించి మెరుగైన వైద్య కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సీకేఎంకు తీసుకొచ్చారు. ఆస్పత్రికి వచ్చిన రోజునే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తే శిశువు ప్రాణం దక్కేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ ఘటనను కుటుంబ సభ్యులకు వివరించి శాంతింపచేశారు. కాగా, తల్లి నవ్య ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఐక్యత చాటాలి

- టీఆర్ఈ నాన్ గెజిటెడ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

హన్మకొండ: కలిసి ఉందామని అంటూనే రెవెన్యూ ఉన్నతాధికారులు రెవెన్యూ ఉద్యోగులను విడదీస్తున్నారని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఆరోపించారు. ఇప్పటికే డిప్యూటీ కలెక్టర్స్ అసోషియేషన్, తెలంగాణ గెజిటెడ్ తహసీల్దార్స్ అసోషియేషన్, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోషియేషన్ ఉందని, వీటితో పాటు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోషియేషన్ ఉండగా రెవెన్యూ శాఖలోని ఉద్యోగులందరం ఒక్కటిగా ఉందామని చెప్తుతూనే కొత్తగా నాయబ్ తహసీల్దార్ల సంఘం ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రెవెన్యూ ఉద్యోగులు జరుగుతున్న పరిణామాల్ని గ్రహించి నాన్ గెజిటెడ్ ఉద్యోగులందరం అసోషియేషన్‌ను బలోపేతం చేసుకోవడంతోపాటు హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

బంగారు 'భాగ్య'..

- గూడూరు క్రీడాకారిణికి అంతర్జాతీయ పారా త్రోబాల్‌లో గోల్డ్ మెడల్
- కుటుంబీకులు, గ్రామస్తుల హర్షం




గోల్డ్ మెడల్‌తో భాగ్య

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని యాదవ నగర్‌కు చెందిన దివ్యాంగురాలు దయ్యాల భాగ్య కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్‌లో దేశం తరపున పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించింది. భాగ్య హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో పీజీ చదువుతోంది. నేషనల్ పారా ఒలంపిక్ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని, సెప్టెంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగిన పారా త్రోబాల్ పోటీలకు ఎంపికై ప్రతిభ చూపింది. ఆ తరువాత అంతర్జాతీయ స్థాయిలో డిసెంబర్ 2 నుంచి 5 వరకు కాంబోడియాలో జరిగిన పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు తెలిపింది. దీనిపై భాగ్య కుటుంబీకులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, నిరుపేదనైన తనకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఖర్చుల నిమిత్తం రూ. 32 వేలు అందించిన 'బెస్ట్ ఫ్రెండ్స్' ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్‌కు భాగ్య కృతజ్ఞతలు తెలిపింది.

మెడికల్ షాపుపై దాడులు

- గడువు ముగిసిన మందులు స్వాధీనం



షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేలేరు : మండల కేంద్రంలోని క్రాంతి మెడికల్ షాపుపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గడువు ముగిసిన మందులు, డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ మందులను గుర్తించారు. సుమారు రూ.లక్ష విలువైన 65 రకాల మందులు, టానిక్‌లను హనుమకొండ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. షాపు యాజమానిపై చర్యలు తీసుకుంటామని కిరణ్ కుమార్ తెలిపారు. కాగా, మండలంలో ఆర్ఎంపీలు తమ క్లినిక్‌ల్లో అనుమతులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తూ స్వల్ప స్థాయిలో జ్వరం వచ్చినా వేలాది రూపాయల మందులు రాస్తూ దండుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ
- హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతి శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు: పోలీసులు సమాజానికి సేవ చేస్తూ శాఖ ప్రతిష్టతను మరింత పెంచాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) సూచించారు. హెడ్‌కానిస్టేబుళ్ల క్రమ శిక్షణతో ట్రైనింగ్ పూర్తి చేస్తే విధి నిర్వహణలో మరింత సులభంగా రాణిస్తారని తెలిపారు. హెడ్‌కానిస్టేబుళ్ల ప్రమోషన్ ట్రైనింగ్‌లో భాగంగా సోమవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో పరిపాలన, ట్రైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో 42 రోజుల పాటు ఇచ్చే 28 జిల్లాలకు చెందిన హెడ్‌కానిస్టేబుళ్ల పదోన్నతి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. హెడ్ కానిస్టేబుల్ శిక్షణకు 28 జిల్లాల నుంచి 813 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రతీ కానిస్టేబుల్ క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, వెంకటేశ్వరరావు, పాండు నాయక్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, మహేశ్, నవీన్, కాశీరాం, రవీందర్, వడ్డె నరేశ్, సుధాకర్, సత్యనారాయణ, దీపక్, సమ్మిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆర్ఎస్సైలు రాజేశ్, సుధాకర్, దశరథం, సీసీ రామాంజనేయరెడ్డి, డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

ద్రవిడ భాషలకు తెలుగు అక్షరమాలే మూలం

- ప్రముఖ పొద్దుటూరు ఎపిగ్రాఫిస్టు ఉమామహేశ్వర శాస్త్రి
- ముగిసిన జాతీయ సదస్సు



సభలో ఉమామహేశ్వర శాస్త్రి, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ద్రవిడ భాషలకు తెలుగు అక్షరమాలే మూలమని పొద్దుటూరు ఎపిగ్రాఫిస్టు(పురాతన శాసనాల పరిశోధకుడు)ఉమామహేశ్వర శాస్త్రి అన్నారు. మూడురోజులుగా కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ముగింపు సదస్సు సోమవారం రాత్రి ముగిసింది. కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన ఈ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పురాతన శాసనాలను పరిశీలిస్తే తెలుగు భాషలోనే అక్షరాలు ప్రధానంగా కనిపిస్తాయన్నారు. చరిత్ర శాసనాల్లో నాటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమాచారం నిక్షిప్తంగా ఉందని కొనియాడారు. తమిళ శాసనాల్లో చాలా వరకు తెలుగు అక్షరాలే దర్శనమిస్తాయని పేర్కొన్నారు. కోల్‌కతా యూనివర్సిటీ హిస్టరీ, కల్చర్ విభాగం అధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ సుస్మిత బసు మజుందార్ మాట్లాడుతూ మూడురోజుల జాతీయ సదస్సు నిర్వహణతో చరిత్రశాసనాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందన్నారు. సోషల్ సైన్స్ డీన్ టి. మనోహర్, హిస్టరీ విభాగం అధిపతి చిలువేరు రాజ్‌కుమార్ మాట్లాడారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ చెందిన పరిశోధకురాలు వేదాంతం సంస్కృతితోపాటు పరిశోధనాపత్రాలను సమర్పించారు. సదస్సులో చరిత్రకారులు టీఎస్ రవిశంకర్, ఎస్. కృష్ణమూర్తి, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ బి. రామచంద్రారెడ్డి, గుంటూరు చిలుకలూరుపేటకు చెందిన రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దాసయ్యచౌదరి, అధ్యాపకులు నాగేశ్వర్ రావు, శ్రీధర్, కృష్ణసుమంత్, ఉప్పయ్య, వై. రాంబాబు, బలుగూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.70 వేల విలువైన గుట్కాలు పట్టివేత

వరంగల్: వరంగల్ చార్‌బౌళిలో శనిగరపు సతీశ్ ఇంటిపై సోమవారం దాడి చేసి సుమారు రూ.70 వేల విలువైన నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

80 కిలోల గంజాయి పట్టివేత

- ఏపీ నుంచి హైదరాబాద్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్



వివరాలు వెల్లడిస్తున్న తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్

మరిపెడ/ మరిపెడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రూ.20 లక్షల విలువ చేసే 80 కిలోల ఎండు గంజాయిని మరిపెడ, సీరోలు పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. సోమవారం తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ మరిపెడ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు మండలంలోని పురుషోత్తమాయగూడెం శివారులో మరిపెడ, సీరోలు ఎస్సైలు సతీశ్, నగేశ్ ఆధ్వర్యంలో శనివారం సంయుక్తంగా వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏపీ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం, మోదుగూడెం గ్రామానికి చెందిన కొర్ర నర్సింగ్, వంతల మోహన్, వంతల సాధు ముఠాగా ఏర్పడ్డారు. వీరు ముగ్గురు కలిసి వైజాగ్‌లోని సీలేరులో 80 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో టాటామ్యాజిక్ వాహనంలో మరిపెడ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు 80 కిలోల సరుకును స్వాధీనం చేసుకొని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది నరేశ్, అనిల్‌కుమార్, సంజీవ రావు, సందీప్‌ను మరిపెడ సీఐ రాజ్‌కుమార్, డీఎస్పీ కృష్ణ కిశోర్ అభినందించారు.

గంజాయి రవాణాదారుల అరెస్టు

కురవి: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఖమ్మం జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో ఏపీలోని సీలేరు నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న ప్యాకెట్ల రూపంలో యువతకు అధిక రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న మహబూబాబాద్‌కు చెందిన సాయి, బండి శ్రావణ్, సురుగు శ్యామ్‌ను అరెస్ట్ చేశామని ఎస్సై తెలిపారు. వీరి నుంచి రూ.15వేల విలువైన 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీశ్ మాట్లాడుతూ గంజాయిని అమ్మినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాళ్లు కాదురా.. వదిలేయండి!


- ఇద్దరు యువకులపై దాడి
- పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

హసన్‌పర్తి : ఓ ఆకతాయిల గుంపు బైక్‌లపై వెళ్తూ కారును అడ్డగించింది. దీంతో కారు ఆపి ఇద్దరు యువకులు కిందికి దిగడంతో వారిపై విచక్షణారహితంగా దాడి చేసింది. అంతలోనే బైక్‌పై మరికొంత మంది యువకులు అక్కడికి చేరుకున్నారు. వారి ని చూసి వదిలేయండిరా? వీళ్లు కాదురా? అని చెప్పడంతో ఆ ఆకతాయిల గుంపు వారిని వదిలిపెట్టింది. ఈ ఘటన హసన్‌పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్కతుర్తి మండలం పెంచికలపేటకు చెందిన బోనగాని పవన్, సాయి కుమార్ బంధువులు. పవన్‌కుమార్ కారు డ్రైవర్‌గా, సాయి కుమార్ అంబులెన్స్ పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 7వ తేదీన పవన్ తన కారును రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తర్వాత పవన్, సాయి కుమార్ కారులో పెంచికలపేటకు బయలుదేరారు. ఆ కారును బైక్‌లపై ఆకతాయిల గుంపు అనుసరించింది. హసన్‌పర్తి పెద్ద చెరువు సమీపంలో అడ్డగించి వారిపై దాడికి దిగింది.

వాళ్లు కాదురా..

ఈక్రమంలో అక్కడికి చేరిన కొంతమంది మీరు కొడుతోంది వాళ్లు కాదురా.. అని చెప్పారు. దీంతో కొట్టడం ఆపి ఫోన్‌చేతికి ఇచ్చి వెళ్లిపోయారు. ఈ విషయమై బాధితుడు సోమవారం హసన్‌పర్తికి చెందిన వెల్గెటి హరీశ్‌తో పాటు బత్తుల విక్రమ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ హసన్‌పర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



భిక్షం(ఫైల్)

పెద్దవంగర: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని కొరిపల్లిలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దీనబోయిన భిక్షం (45) కులవృత్తి గొర్రెలను కాసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది రోజుల నుంచి తన ఇంటి మరమ్మతులు చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్ సరఫరా కాకపోవడంతో బల్బ్‌ను తీసి పెట్టే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కూతుళ్లు సమత, మమత ఉన్నారు.

ఏడాది అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



ర్యాలీ ప్రారంభిస్తున్న రావు పద్మ

హన్మకొండ : ప్రజలకు ఏమి ఒరగబెట్టారని విజయోత్సవాలు, సంబురాలు జరుపుకుంటున్నారు.. ఏడాది అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కాంగ్రెస్ నాయకులను సవాల్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కాజీపేట నుంచి హనుమకొండ చౌరస్తా వరకు నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించిన రావు పద్మ.. హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని విస్మరించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే హనుమకొండ నగర అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఈ విషయమై ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, పార్టీ నాయకులు రావుల కిషన్, డాక్టర్‌పెసరు విజయ్ చందర్ రెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, చిర్ర నర్సింగ్ గౌడ్, జువ్వాడి నర్సింగరావు, నర్మెట్ట శ్రీనివాస్‌రావు గౌడ్, డి.అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్య కేసు దర్యాప్తు వేగవంతం

- కీలక ఆధారాల కోసం మరోమారు రిసార్టులో పరిశీలన

వాజేడు: ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్య చేసుకున్న కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేసినట్లు తెలుస్తున్నది. అందులో భాగంగానే సోమవారం ఎస్సై ఆత్మహత్యకు పాల్పడిన పెరియాడో రిసార్ట్‌లోని 107 గదిని కీలక ఆధారాల కోసం పోలీసులు మరోమారు పరిశీలించినట్లు సమాచారం. మండల పరిధిలోని పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపాన ఉన్న పెరియాడో రిసార్టులో ఎస్సై హరీశ్ ఈ నెల 2న ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. దీనిపై ఎస్సై తల్లిదండ్రులు పెట్టిన కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వివరాల సేకరణకు మరోమారు రిసార్టును పరిశీలించినట్లు తెలుస్తోంది. రిసార్టుకు వెళ్లిన పోలీసులు అక్కడి సిబ్బందిని విచారించి, కొన్ని పత్రాలు,రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆత్మహత్య చేసుకున్న రోజున క్లూస్ టీం సభ్యులు అక్కడ లభించిన ఆధారాలను సేకరించారు. ఎస్సై రిసార్టుకు వచ్చిన రోజున ఉన్న సిబ్బంది వివరాలు తెలుసుకొని వారితో మాట్లాడినట్లు సమాచారం.

వ్యక్తిపై కానిస్టేబుల్ దాడి

- కాల్చి చంపుతానని బెదిరించారని బాధితుడి ఫిర్యాదు

వరంగల్ : పైడిపల్లికి చెందిన కానిస్టేబుల్ యుగంధర్, అతని బంధువులు మూకుమ్మడిగా తనపై దాడి చేయడమే కాకుండా కాల్చిచంపుతానని బెదిరించారంటూ ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పైడిపల్లిలోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన పిన్నింటి ప్రకాశ్‌రావు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం తన మనవడిని స్కూల్ బస్సులో ఎక్కించేందుకు స్కూల్ వ్యాన్ ముందు నిలబడి ఉండగా పక్క నుంచే కారులో వెళ్తున్న క్రమంలో మా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదుపై ఎస్సై రాజు మా ఇంటికి వచ్చి విచారణ జరుపుతుండగా కానిస్టేబుల్, బంధువులు వచ్చి తనపై దాడి చేయడమే కాకుండా దుర్భాషలాడాడని తెలిపారు. కానిస్టేబుల్‌తో తన ప్రాణాలకు ముప్పు ఉందని ప్రకాశ్‌రావు తెలిపారు. ఎస్సై రాజును వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమే అని ఇరువర్గాలు ఫిర్యాదులు చేశారని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర॥ 8341479342. [WA-7547]

CHANGE OF NAME

■ I, the undersigned BEERAVOLU RAM REDDY (New Name), previously called BEERAVELLI RAM REDDY (Old Name), and residing at H.No. 4-118, Nainpaka Village, Chityala Mandal, Jayashankar Bhupalpally District- 506356, Telangana State, India and solemnly delcare. [W-1264048]

VEHICLE FOR SALE

■ 2015 TATA LPT 3118 TC COWL CHASSIS Registration No: TS08UG5666, Engine No: 51E63442378, Chassis No: MAT466388F1E11684, Vehicle for Sale. M/s. Indusind Bank Ltd. Cont: 7338745953. [W-1264106]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]

WANTED

■ మా అపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్ (స్త్రీ/పురుషులు) అర్జెంట్‌గా కావలెను. సంప్ర॥ 9491710857, 7382106287. [W-1264045]

■ మా ఆఫీస్‌లో పని చేయుటకు అర్జెంట్‌గా స్త్రీలు కావలెను. Age: 18-45 Years గల వారు అర్జెంట్‌గా కావలెను. సంప్ర॥ 7382323126, 9491706517. [W-1264046]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.